నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 01, 2025 | www.navatelangana.com

ఆదిలాబాద్‌కు రెజ్లర్ ది గ్రేట్ ఖలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్నేషనల్ డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ ది గ్రేట్ ఖలీ ఆదిలాబాద్ పట్టణంలో సందడి చేశారు. స్థానిక ఆదిత్య ఖందేష్కర్ గెస్ట్ హౌస్‌లో బస చేసిన ఆయనను కలిసేందుకు పట్టణ వాసులు ఆసక్తి కనబరిచారు. హైదరాబాద్ నుండి పంజాబ్ వెళ్తున్న ఆయన తన మిత్రులను కలిసేందుకు ఆదిలాబాద్‌కు రాగా ఖలీకి స్థానికంగా ఘన స్వాగతం లభించింది. పుష్పగుచ్ఛాలు అందచేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆదిత్య ఖందేష్కర్ గెస్ట్ హౌజ్‌లో ఆయన బస చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఖలీని కలిసి శాలువాలతో సత్కరించారు. ఆదిలాబాద్‌తో తనకున్న పరిచయాన్ని గుర్తు చేసుకున్న ఖలీ ఇక్కడి స్నేహితులు అమితమైన ప్రేమను చూపుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అవకాశం దొరికినపుడల్లా జిల్లాకు వస్తానని పేర్కొన్నారు. ఇక ఖలీని కలిసి ఆయనతో ఫోటోలు దిగేందుకు యువత ఆసక్తి చూపారు. ఖలితో సేల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

దేశవ్యాప్తంగా కులగణన జరిపి, 42శాతం రిజర్వేషన్లను అమలు కొరకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్లో చట్టరూపంలో తేవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేష్ ప్రకటనలో డిమాండ్, బీసీ సంక్షేమ సంఘం ఉద్యమానికి అలాగే ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు సీపీఐ(ఎం) మద్దతు తెలుపుతున్నామని అన్నారు. కేంద్ర ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తుంటే రాష్ట్రంలో బీజేపీ నాయకులు కులగణనకు, రిజర్వేషన్లకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని. అందువల్ల సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరమని ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు సీపీఐ(ఎం) మద్దతు తెలియజేస్తున్నదని అన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


ఆదిలాబాద్‌లో ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముస్లిం సోదరులు తమ ప్రధాన పండగ ఈద్ ఉల్ ఫితర్‌ను ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలు ఆచరించగా ఆదివారం నెలవంక దర్శనంతో ఈద్‌ను ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద సాముహిక ప్రార్థనలు నిర్వహించారు. నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక నమాజ్ ఆచరించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు జరిపారు. మత పెద్దల సమక్షంలో ప్రార్థనలు జరిపి ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాముహిక ప్రార్థనల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ మైదాన ప్రాంగణాన్ని పరిశీలించి భద్రత చర్యలపై దిశా నిర్దేశం చేశారు. మరోవైపు ముస్లిం సోదరులకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. స్థానిక ఈద్గా మైదానం వద్ద ఈద్ నమాజ్ అనంతరం ముస్లింలకు ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జోగురామన్న ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయనతో పాటు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ కార్యదర్శి గంద్రత్ సుజాత, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, గిమ్మ సంతోష్ ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న మాట్లాడుతూ నెల రోజుల నుండి ఉపవాస దీక్షలు ఆచరించి ముస్లిం సోదరులంతా ఈద్‌ను ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. ప్రజలంతా ఒక్కటై జీవిస్తేనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని, దేశం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు ఐకమత్యంగా ఉంటూ దేశ హితం కోసం పాటు పడాల్సిన అవసరముందన్నారు. ఇదిలా ఉంటె నమాజ్ అనంతరం వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్ల రిబ్బన్‌ను ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కెరమెరి : రంజాన్ పర్వదిన వేడుకలను మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సుల్తాన్‌గూడలోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు మసీదులకు సంబంధించిన ఇమామ్‌లు రంజాన్ సందేశాన్ని జనాలకు వినిపించి అందులోని మంచి విషయాలకు వెల్లడించారు. ఇమామ్ ఖుద్బా మాట్లాడుతూ ప్రతివ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూసిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఈద్గాలో ఉన్న ఖబరస్తాన్‌లోని తమ పితరుల సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. సుల్తాన్ కూడాతో పాటు ఝరి ఈద్గా వద్ద ఎస్సై గుంపుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్నారులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు సోదరులు, సదర్ ఇసూబ్, ఇనూస్, రజాక్, మాజీ ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, మాజీ ఉప సర్పంచులు నిసార్, ఇనూస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ అవైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు సుజాయిత్ ఖాన్, సజీద్ ఖాన్, కుతూబొద్దీన్, ఖలీల్ హుస్సేని పాల్గొన్నారు

సిరికొండ : మండల కేంద్రంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షలను ఎంతో పవిత్రంగా చేపట్టారు. ఉదయం మండల కేంద్రంలోని జామ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ ముస్లిం తేడా అనే తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్


సిరికొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : బొజ్జు



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలనిలో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. మహిళ సహాయక సంఘాలుగా ఏర్పడితే ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను అందజేస్తామని చెప్పారు. స్వయంగా నీటిని వినియోగించుకోవడంతో పాటు ఉపాధి దొరుకుతుందన్నారు. సిగ్నల్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాల సమగ్ర అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో రూ.35లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మసాదే చరణ్, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ గదవేణి మల్లేష్, బదావత్ ఇందులాల్ నాయక్, చునార్కర్ వసంత్‌రావ్, దీపక్, అంబాజీ, సుభాష్, సకారాం, కిషన్, బీసీ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, శంకర్, సత్రవేణి రాజన్న, అరుణ్ పాల్గొన్నారు.

సేవాలాల్ భక్తులకు పండ్ల పంపిణీ



నార్నూర్: ఉగాది నుంచి సేవాలాల్ దీక్ష భక్తులు కెరమెరి మండలంలోని శంకర్ లొద్ది నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం రెండో రోజు తాడిహత్నూర్ గ్రామంలో సేవాలాల్ యూనియన్ ఎంప్లాయిస్ యువత ఆధ్వర్యంలో దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ ద్వారా దీక్షపరులకు పండ్లు, నీటి ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. అల్పాహారం అందించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సేవాలాల్ దీక్ష పరులు వారం రోజులుగా పౌరదేవి వరకు చేపట్టిన మహా సంకల్ప పాదయాత్ర కొనసాగించి శ్రీరామ నవమి రోజు దీక్ష విరమణ చేస్తారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం...

8వ షెడ్యూల్‌లో గోర్ బోలిని భాషను చేర్చడం పట్ల అసెంబ్లీలో తీర్మానించడం, కేంద్రప్రభుత్వానికి పంపించడం అభినందనియమని తాడిహత్నూర్ సేవాలాల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గ్రామస్తుల తరుపున వారు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు చౌహాన్ కిషోర్, చౌహాన్ పునిరాం, జాదవ్ పరశురాం, జాదవ్ ఆనంద్‌రావ్, రాథోడ్ గణేష్, నాయక్ కారోబారి, రాథోడ్ దినేష్, రాథోడ్ తానాజీ, జాదవ్ పృథ్విరాజ్, టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌహాన్ నరేష్, సేవాలాల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, యూత్ సభ్యులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కాలిన డ్రాగన్ ఫ్రూట్ తోట

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని లింగోజితండ గ్రామపంచాయతి సమీపంలో డ్రాగన్ ఫ్రూట్ తోట ప్రమాదవశాత్తు కాలిపోయింది. సోమవారం రైతు రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రాగన్ ఫ్రూట్ తోటలో రెండు ఎకరాలకుపై బడి డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు డ్రిప్ పైపులు వేసినాను అన్ని మొక్కలు కాలిపోయాయి. దీంతో సుమారు రూ.12 లక్షల వరకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ సర్పంచ్ జాదవ్ హరి నాయక్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

దేశ కీర్తిని ఇనుమడింపజేశారు : శంకర్

ఆదిలాబాద్‌టౌన్ : సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే మన పూర్వీకులు ఎన్నో విషయాలను కనుగొని దేశకీర్తిని ఇనుమడింపచేశారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంతనం ఒక సంకల్పం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి సమక్షంలో వేద పండితులు ముందుగ ప్రత్యేక పూజలు జరిపారు. మహాగణపతిని ఆరాధించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఒగ్గు కథలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పూర్వకాలంలో సాంకేతికత లేని రోజుల్లోనే అనేక ప్రశ్నలకు మన పూర్వీకులు సమాధానాలు ఇచ్చారని తెలిపారు. పంచాంగంపై ప్రస్తుతం 42 దేశాల్లో రీసర్చ్ కొనసాగుతోందని, గ్రహణాలు, అమావాస్య, పౌర్ణిమ వంటి తిథులను ఇంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగారన్న విషయాలపై ప్రపంచ దేశాలు విస్తుపోతున్నాయని తెలిపారు.

రాజీవ్ యువ వికాసం పథకం
దరఖాస్తుల స్వీకరణ గడువు

ఏప్రిల్ 14 వరకు పొడిగింపు

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈబీసీ ఈడబ్ల్యూఎస్‌కు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రం, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. మీ సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకొనేవారు అదనపు చార్జీలు చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఈ నెల 14 వరకు పొడిగించారని, ఆసక్తి గల వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై డిప్యూటీ సిఎం మల్లు బట్టివిక్రమార్క, చీఫ్ సెక్రటరీ కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి, నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌ను వివరించారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచామని తెలిపారు. జూన్ 2న అర్హులకు మంజూరు పత్రాలు అందజేయాలని, జూన్ 2 నుంచి 9 వరకు ప్రతి రోజు ఒక మండలం చొప్పున నియోజకవర్గం అంతటా శాంక్షన్ లెటర్లు అందజేయాలని తెలిపారు. జూన్ 9 తర్వాత శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని, 50వేల వరకు లబ్ది పొందిన వారికి వారం రోజులపాటు, 50 వేల నుంచి రెండు లక్షల వరకు లబ్ది పొందిన వారికి 15 రోజులపాటు, 2లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాలని కోరారు. జూలై మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక అధికారిని నియమించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సీవీఎస్ రాజు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజలింగు, ఈడీఎం రవి పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ, నవీకరణ సక్రమంగా నిర్వహించాలి



నవతెలంగాణ-జైనథ్

రికార్డుల నిర్వహణ, నవీకరణను సక్రమంగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, నవీకరణ ప్రతిరోజు సరైన సమయంలో నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వీడియో ద్వారా పరిష్కరించే దిశగా వ్యవస్థను నిర్మించాలని తెలిపారు. తమ పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం సమయాల్లో సీఐ స్థాయి, ఎస్సై స్థాయి అధికారులు సందర్శిస్తూ, గ్రామంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తూ, పరిష్కరించే దిశగా పోలీసు మీకోసం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా తెలపాలని వెంటనే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీలైనంత వరకు అన్ని పోలీసు కార్యాలయాలలో సిబ్బందికి వారాంతపు సెలవు పద్ధతిని అమలు చేసే విధంగా సిబ్బంది విధులను కేటాయించాలని అన్నారు. మండలంలో ఉన్న రౌడీలపై సరైన రౌడీ షీట్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. గంజాయి పూర్తిగా నిర్మూలించే వరకు సమాచార వ్యవస్థను మరింత పటిష్టంగా మెరుగుపరచుకొని మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. బ్లూ కోర్ట్, 100 డయల్ ప్రతిరోజు పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలైన నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ సరైన క్రమశిక్షణ, జవాబు దారితనం, అలవర్చుకోని, అవలంబించాలని నీతి నిజాయితీలతో విధులను నిర్వర్తించాలని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారి ఎప్పటికప్పుడు కోర్టులలో నిందితులకు, నేరస్తులకు శిక్షలు పడేవిధంగా సాక్షులను సరైన సమయంలో కోర్టులలో హాజరు పరిచేలా చూసుకోవాలన్నారు. సిబ్బంది విధులు సీఐ, ఎస్సై స్థాయి అధికారులకు మంచి పేరును వచ్చే విధంగా ఉండాలన్నారు. స్టేషన్ రిసెప్షన్‌లో ఎక్కువ ఫిర్యాదులు వచ్చే విధంగా సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ కుల దైవం జెండాలకు నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ - కాసిపేట



ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామ పరిధిలో నాగోబా దేవత ఆలయ సమీపంలో ఉన్న ఆదివాసీ కుల దైవం గోండి ధర్మ గురు హిరసుఖ జెండాలకు దుండగులు నిప్పు పెట్టడం హేయమైన చర్య అని, ఇలాంటి చర్యలకు పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా పర్దన్ పురోహిత్ ఉపాధ్యక్షులు మడావి అనంతరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చింతగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ చర్యను యావత్ ఆదివాసీ సమాజం ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ తెగలలో ఆదివాసుల ఐక్యత ఓర్వలేని కొంత మంది దుర్మార్గులు ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడడం శోచనీయమన్నారు. ఇలాంటి చర్యల వల్ల ఆదివాసుల ఆత్మాభిమానాలు దెబ్బతింటాయని తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ పర్ధన్ జన్ జాతి ఉత్తన్ సంఘటన్ మండలం ప్రధాన కార్యదర్శి మడావి మన్‌మోహన్, గేడం పాండురంగ్, గేడం లక్ష్మణ్, ఆర్క రాము, పెందూర్ లక్ష్మణ్, పెంద్రం శ్రీను, ఆర్క వినోద్, అర్క మాణిక్‌రావ్, అర్క సంతోష్ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

నవతెలంగాణ-నార్నూర్



సమాజంలో అంకిత భావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకురాలు సుగుణ, జిల్లా సార్మెడీ దుర్గ పటేల్ అన్నారు. 37 సంవత్సరాలం సుదీర్ఘంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యా శాఖలో ఉపాధ్యాయులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన రాథోడ్ హరిచంద్‌ను సోమవారం జామడ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన విరమణ కార్యక్రమంలో పాల్గొని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి అత్యుత్తమ సేవలందించి, అందరి మన్ననలు పొందారని తెలిపారు. అహర్నిశలు కృషి చేసి ఎందరో గిరిజన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటిడిఓ క్రాంతి కుమార్, ప్రధానోపాధ్యాయురాలు వందన, చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయ సిబ్బంది ఆడే విశ్వనాథ్, ఆడే కైలాష్, చంపావతి, జాదవ్ శివాజీ, రాజ్యలక్ష్మి, ముక్త, రవీందర్ రాథోడ్, జాదవ్ రజినీకాంత్ పాల్గొన్నారు.

3న జంబుగా నర్సరీ, పండ్ల తోటల వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐటిడిఏ ఉట్నూర్ పరిధిలోని కాగజ్‌నగర్ మండలం జంబుగా ఉద్యాన నర్సరీ, మామిడి పండ్ల తోటల వేలం ఏప్రిల్ 3న నిర్వహిస్తున్నామని ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోటలో బంగినపల్లి, దశేరి తోతాపురి, రసాలు, హిమాయత్ మరియు లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయన్నారు. రానున్న మూడు సంవత్సరాలకు కలిపి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాట దక్కించుకున్న వారు మూడు సంవత్సరాలు తోట నిర్వహణ పూర్తిగా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు రూ.10వేలు ధరావత్ సొమ్ముతో ఏప్రిల్ 3న జంబుగాలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి లేదా సంబంధిత నర్సరీ సాంకేతిక అధికారులను(ఫోన్ నంబర్లు 8897478825, 9441020755) సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | ఏప్రిల్ 01, 2025 | www.navatelangana.com

ఈద్గా వద్ద ఎస్పీ బందోబస్తు పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రంజాన్ పర్వదినాన నిర్మల్ పట్టణ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ప్రక్రియను ఎస్పీ డా.జి.జానకి షర్మిల పరిశీలించారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ,



ప్రార్థనలు జరిగే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందికి తగు సూచనలు చేశారు. వేడుకలను ప్రశాంతంగా నిర్వహించడంతో పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఆమెతో పాటు ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ ప్రవీణ్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కడెం

మండలంలోని బాబా నాయక్ గ్రామపంచాయతీ పరిధిలోని గంగన్నపేట గ్రామానికి చెందిన కోవ కౌసల్య నెల రోజుల కింద అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మానవత దృక్పథంతో స్పందించి వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆ చిన్నారులకు తనవంతుగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే వెడ్మ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ఘనంగా రంజాన్ పర్వదినం



నేరడిగొండ : ముస్లిములకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఈద్గా వద్ద సోమవారం ముస్లింలు రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నా పెద్ద అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ రంజాన్ ప్రార్థనలు చేశారు. అనంతరం అలై బలై తీసుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఇస్లాం మత పెద్దలు, హస్సేన్ పాషా, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తలమడుగు : రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని ముస్లింలకు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుంకిడి, ఉండం గ్రామాలలోని ముస్లింల ఇంటింటికి వెళ్లి అలై బలై చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు విలాస్ యాదవ్, మాజీ సర్పంచ్ లస్మన్న, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫిక్, చోటే ఖాన్, అక్తర్ భాయ్, సత్తార్, అప్సర్, లతీఫ్, అంజాద్, వాలి మహమ్మద్, ప్రవీణ్‌రెడ్డి, గాజుల సాంబశివ, పోతన్న, సల్ల దేవన్న, నడిపెన్న, విలాస్ యాదవ్, పొచ్చన్న, రావుల నారాయణ పాల్గొన్నారు.

తాంసి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు నెల రోజుల పాటు ఎంతో పవిత్రంగా కఠినంగా ఉపవాసాలు చేసి సోమవారం రోజున తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న మైనార్టీలు ఆయా గ్రామాల్లో రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో అందరూ కలిసి ఉదయాన్నే ప్రార్థనలు చేశారు. హిమామ్‌లు నమాజ్ చేసి ఖురాన్ చదివారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మసీదుల వద్దకు చేరుకొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులను స్నేహితులను తమ ఇంటికి తీసుకువెళ్లి తీపి పాయసాలను అందించారు. కులమతాలకతీతంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఖానాపూర్ : అత్యంత భక్తి శ్రద్ధలతో నెల రోజుల పాటు జరిగే ఉపవాసాలను నియమ నిష్టలతో ముస్లింలు తరతరాలుగా ఆచరిస్తూ వస్తున్న రంజాన్ మాసం చివరి అంకానికి చేరుకుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ఈద్గా వద్ద జరిగిన రంజాన్ పర్వదిన వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లింలను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కుల మత ప్రాంత బేధాలు లేకుండా కలసి కట్టుగా అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సోదర భావంతో మెలగాలని సూచించారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు, చిన్నారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలో మైనారిటీలు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ పాల్గొని, ముస్లింలకు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ ముస్లింలంతా పండగ పర్వదిన వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అన్నారు. ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. స్నేహం, కరుణ, క్రమశిక్షణ, దయాగుణాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినం మానవాళిని ఆదర్శంతంగా తీర్చిదిద్దబడుతోందని అన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరు సంతోషకంగా గడపాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి సుగుణను ఆత్మీయంగా పలుకరించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కడెం : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పడిగెల భూషణ్, మండల కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని మైనార్టీలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన పడిగెల భూషణ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు రెంకల శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, బాబా, మునీర్, మైనార్టీలు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని తాడిహత్నూర్, నాగల్‌కొండ, ఇలియాస్ నగర్ తదితర గ్రామాల్లో సోమవారం రంజాన్ ఈద్ ఉల్ ఫితర్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరి నొకరు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుచికర సేమియా పాయసం, భోజనాల కోసం మిత్రులకు బంధువులకు ఆహ్వానం పలికారు. ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇంట్లో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విందులో కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ హజరై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తం రాథోడ్, నర్సింగ్ మోరే, డిగాంబర్ ఆడే, నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ వైస్ ప్రసిడెంట్ షేక్ నషీర్, మండల యూత్ ప్రెసిడెంట్ ముబషీర్, జాకీర్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, సొనారి, గోడపూర్ తదితర గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం చివరి రోజున ఉదయం ముస్లింలు అందరూ కలిసి గ్రామాల్లో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముధోల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కిరణ్ కొమ్రెవార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎనిలా అనిల్ ముస్లింలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, గిరి పోశెట్టి, బాబు, ఎస్‌కే రఫీక్, అబ్రార్ ఖాన్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : నిర్మల్ పట్టణంలో పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పట్టణంలోని ఈద్గా వద్ద గల ప్రార్థన మందిరంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్మల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ముస్లింలు చిన్నపిల్లలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఖానాపూర్‌లో శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు..

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింలను డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆలింగనం చేసుకొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు ముగించుకుని ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినం అన్నారు. అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి, ఎర్రవోతు రాజేందర్, కొట్టే శేఖర్, నల్లూరి పోశెట్టి, అయ్యన్నగారి పోశెట్టి, గంగోని బురాజ్, కొండ శ్రీనివాస్, నరేందర్, చిరంజీవి, శామకూర రాము, సతీష్‌రావు, మార నరసింహరెడ్డి పాల్గొన్నారు.

సేమియాల పంపిణీ ...

తలమడుగు : మండలంలోని రుయ్యాడిలో రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం హస్సేన్ హుస్సేన్ సవారి బంగ్లా వద్ద గ్రామస్తులకు సేమియాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి మాట్లాడుతూ తరతరాల నుంచి గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రతి ఏటా సవారి బంగ్లా వద్ద సేమియాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. గ్రామంలో కులమత బేధాలు లేకుండా మొహరం పండుగతో పాటు రంజాన్ రోజున గ్రామస్తులు అందరం కలిసి సేమియాలు పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పండగలతో పాటు రాజకీయ విభేదాలు లేకుండా గ్రామాభివృద్ధికి పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి, గంగాధర్, అశోక్, పోతారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింలు, ఉత్తం, మోతే శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్ : శుభాకాంక్షలు చెబుతున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



కుభీర్ :రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కిరణ్ కొమ్రెవార్



ఉట్నూర్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



తలమడుగు : రంజాన్ వేడుకల్లో పాల్గొన్న విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి

సేవాలాల్ పాదయాత్ర దీక్షదారులకు అల్పాహారం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్, లింగోజీతండా ఎక్స్‌రోడ్డు వద్ద మహా సంకల్ప సేవాదళ్ పాదయాత్ర సేవాలాల్ దీక్ష దారులకు సోమవారం అల్పాహారాన్ని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, మాజీ సర్పంచ్ హరి నాయక్ జాదవ్, కొత్తపల్లి దీక్ష భూమి పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో సేవాలాల్ పాదయాత్ర సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. లింగోజీతండా వాసులు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కి స్వాగతం పలికారు. భక్తులు సాంస్కృతిక పాటలు పడుతూ, ఎంతో ఉత్సహంగా నృత్యలు చేశారు. అనంతరం భజన కార్యక్రమాన్ని రెండు గంటల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు సేవాలాల్ దీక్ష దారులు కొత్తపల్లి నుంచి పౌరాదేవి వరకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఎక్స్ రోడ్డులో అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరికి అల్పాహారం అందించమన్నారు. మహారాజ్ మాట్లాడుతూ సేవాలాల్ భక్తులు ప్రశాంతంగా ఉంటూ పాదయాత్రలో ముందుకు కొనసాగాలన్నారు. 41, 21, 11 రోజుల పాటు భక్తి శ్రద్ధాలతో ఉంటూ, ఒక్క పుట్ట భోజనం చేసి, కాళ్లకు చెప్పులు లేకుండా సేవాలాల్ మహారాజ్ దీక్షదారులు ఉన్నారు. అల్పాహారంలో 5 వేల నుంచి ఆరు వేల వరకు సేవాలాల్ దీక్ష దారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ నియోజకవర్గంలోని 137 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.45 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదవారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, పట్టణాధ్యక్షులు, మండలాల అధ్యక్షులు, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శ్రీరామనవమి పురస్కరించుకొని నిర్వహించనున్న శ్రీరామ వీర హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమం పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఏప్రిల్ 6న ఉదయం 10గంటలకు దేవరకోట దేవస్థానం నుంచి ఈ శోభాయాత్ర మొదలవుతుందని, ముఖ్యఅతిథిగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హిందూవాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి ప్రధానవక్తగా ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు యోగేష్ ప్రభు హాజరవుతున్నారని, ఈ శోభాయాత్రకు హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.

మీ సేవా ద్వారా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రాజీవ్ యువ వికాసానికి మీసేవ ద్వారా దరఖాస్తులు చేసుకునేవారు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని, లేదా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వవచ్చని అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు క్యాస్ట్, ఇన్‌కం, రెసిడెన్స్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయానికి సంబంధించినవి అయితే పట్టా పాస్ బుక్ జిరాక్స్, వ్యవసాయ బోర్‌వెల్స్‌కు సంబంధించినవి అయితే గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు సర్టిఫికెట్ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ ఇవ్వాల్సి ఉంటుందని ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని పట్టణంలోని అండర్-14, 16, 19 క్రీడాకారులకు గండి రామన్న సాయిబాబా ఆలయ సమీపంలో గల శిక్షణ కేంద్రంలో ప్రత్యేక సమ్మర్ క్యాంపు ఏప్రిల్ 3వ తేది నుంచి నిర్వహిచడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ రామరాజు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కొరకు 9912939724 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు తేదీని పొడిగించాలి

- టీఏజీఎస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

యువ వికాసం స్కీమ్ అర్జీ తేదీని పొడిగించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం టీఏజీఎస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. సోమవారం పట్టణంలోని వైయస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రేషన్ కార్డులతో లింక్ చేయడం వల్ల రేషన్ కార్డు లేని పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కులం సర్టిపికెట్స్, ఆదాయం సర్టిపికెట్స్ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందు తున్నారని అన్నారు. అధికారులు రేషన్ కార్డు లేనిది ఆదాయం సర్టిపికెట్స్ ఇవ్వలేమని, ఆదాయం సర్టిఫికెట్ లేనిది ఆన్‌లైన్‌లో అప్లికేషన్ కావడం లేదని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన ఎంతో మంది ప్రభుత్వ సాయాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. అదనంగా ఈ పథకాల అమలులో అనేక పరిమితులు విధించడం వల్ల సాయం అందకుండానే మిగిలిపోతుందన్నారు. సరైన అవగాహన కల్పించకపోవడం వల్ల అర్హులైన చాలా మంది సమాచారం లేకుండా అవకాశాన్ని కోల్పోతున్నారని తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు కేవలం రాజకీయ ప్రచారంగా మిగిలిపోకుండా, నిజమైన అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తులు స్వీకరించే తేదీని పొడగించాలని అన్నారు. ఈ సమావేశంలో శంభు సోయం, సూర్యబాన్, ఉయిక భీంరావు, అర్జున్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
నమ్మిన రోజూ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్-మంచిర్యాల
మంగళవారం | ఏప్రిల్ 01, 2025 | www.navatelangana.com

తొలితరం ఉద్యమకారుడు కోరెంగ గోవిందరావు

● తుడుందెబ్బ రాష్ట్ర రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీ తొలితరం తుడుందెబ్బ ఉద్యమకారుడు కోరెంగ గోవిందరావు అని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గోవిందరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా గోవిందరావు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆదివాసి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. సామాజిక కార్యకర్త అజయ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వేట్టి మనోజ్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు సలాం వరుణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలో సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి, కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఆర్థికంగా చేయూత ఇవ్వాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి లబ్దిదారులకు ఈ చెక్కులను ఇవ్వడం జరిగిందని, మునుముందు కాంగ్రెస్‌ని ఆదరించాలని కోరారు.

42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆర్టికల్ 9వ షెడ్యూల్లో చేర్చాలి

● ఢిల్లీ బయలుదేరిన బీసీ సంఘాల నాయకులు



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు భారత రాజ్యాంగంలో గల ఆర్టికల్ 9వ షెడ్యూల్లో చేర్చాలని జిల్లా బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సోమవారం మంచిర్యాల నుంచి ఢిల్లీ బయలుదేరిన నాయకులు కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ శాసనసభ సమావేశాల్లో రిజర్వేషన్‌కు సంబంధించి రెండు బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపగా వాటికి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరమని తెలిపారు. ఈ మేరకు హలో బీసీ ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2న బీసీ రిజర్వేషన్, హక్కుల కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టిన సందర్భంగా జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన కుల సంఘాల నాయకులు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. బీసీ రిజర్వేషన్ బిల్లు విషయమై కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ అధికారులకు వినతీ పత్రం అందజేయన్నారు. సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగరంగాల్లో ఓబీసీల హక్కులను పరిరక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించాలని భావిస్తున్నారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, చెన్నూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి, శివ్వారం మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్, పిట్టల రవీందర్, కుమ్మరి వినోద్, నరేష్, జాతీయ బీసీ సంఘాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొడేల్ల శ్రీనివాస్ ఉన్నారు.

యువత ప్రభుత్వ కొలువులు సాధించాలి

● ఆర్మీ ఉద్యోగాలు పొందివారిని సన్మానించిన ఎస్ఐ శ్రీధర్



నవతెలంగాణ-జైపూర్

సమాజంలో గుర్తింపు పొందడం కోసం యువతరం ప్రభుత్వ కొలువులు సాధించాలని స్థానిక ఎస్ఐ శ్రీధర్ సూచించారు. మండలంలోని మిట్టపల్లికి చెందిన మొర్ల సాయి తరుణ్, ముదిగుంటకు చెందిన అనవేని రాకేష్‌లు ఆర్మీలో ఉద్యోగాలు పొందిన సందర్భంగా సోమవారం వారిని శాలువాలతో సన్మానించారు. యువకులు కష్టపడి చదివి ప్రభుత్వ కొలువులు సంపాదిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా కుటుంబానికి గౌరవం దక్కడమే కాకుండా ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తున్నందున ఉద్యోగం పొందడం కోసం యువకులు కష్టపడి చదుకోవాలని తెలిపిన ఆయన సామాజిక మాధ్యమాలకు అలవాటు పడిన వారు భావి జీవితాలను నష్టపోవల్సివస్తోందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ అధికారుల ఫోన్ నెంబర్లు మార్పు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న అధికారుల ప్రభుత్వ ఫోన్ నెంబర్లు మారినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రావురి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా, డివిజన్, మండల వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు, రైతులు విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

అధికారుల నెంబర్లు

హోదా	సెల్
జిల్లా వ్యవసాయ అధికారి	8977748730
ఏడీఏ (టెక్నికల్)	8977748780
ఏఓ (టెక్నికల్) 1	8977748790
ఏఓ (టెక్నికల్) 2	8977748799
ఏఓ (టెక్నికల్) 3	8977748801
ఆసిఫాబాద్ సహాయ సంచాలకులు	8977748810
కాగజ్‌నగర్ సహాయ సంచాలకులు	8977748816
సిర్పూర్-యు సహాయ సంచాలకులు	8977748819

మండల వ్యవసాయ అధికారులు

మండలం	సెల్
ఆసిఫాబాద్	8977748820
తిర్యాని	8977748869
వాంకిడి	8977748870
రెబ్బెన	8977748846
కాగజ్‌నగర్	8977748836
బెజ్జూర్	8977748826
చింతలమానెపల్లి	8977748827
దహెగాం	8977748834
కౌటాల	8977748842
పెంచికల్ పేట్	8977748845
సిర్పూర్(టి)	8977748860
జైనూర్	8977748835
కెరమెరి	8977748837
లింగాపూర్	8977748843
సిర్పూర్(యు)	8977748867

పన్ను వసూళ్లలో జైపూర్ ఫస్ట్

నవతెలంగాణ-జైపూర్

మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు కృషి ఫలించింది. జిల్లాలో ఆస్థి పన్ను వసూళ్లలో జైపూర్ మండల ముందంజలో నిలిచింది. గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిరంతర కృషి, జిల్లా అధికారుల పర్యవేక్షణల్లో 96 శాతం వసూలు చేసింది. గ్రామ పంచాయతీ నిర్వాహణ బాధ్యలతో పాటు రోజు వారిగా ఆస్థి పన్ను వసూళ్లపై దృష్టి సారించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిపారు. జిల్లాలో జైపూర్ ఫస్ట్ ప్లేస్‌లో నిలువగా 86 శాతం వసూళ్లతో జన్నారం లాస్ట్ ప్లేస్‌తో సరిపెట్టుకుంది. కన్నెపల్లి మండలంలో కూడా 96 శాతం ఆస్థి పన్ను వసూళ్ల పూర్తి చేసినప్పటికీ కన్నెపెల్లి మండలం 15 గ్రామ పంచాయతీలతో చిన్నదిగా ఉండటమే కాకుండా రెవెన్యూ పరంగా వసూళ్ల తక్కువగా ఉంటుంది. జైపూర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలు కాగా రెవన్యూ పరంగా వసూళ్ల ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా జిల్లా పంచాయతీ కార్యాలయం విడుదల చేసిన రికార్డు ప్రకారం జైపూర్ మండలం మొదటి స్థానంలో నిలువగా రెండవ స్థానంలో కన్నెపల్లి నిల్చింది. జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉండగా ఇందులో జైపూర్, కన్నెపల్లి 96 శాతం, భీమారం, కోటపల్లి, లక్షెటిపేట్ 94 శాతం, భీమిని, కాసిపేట్ 93 శాతం, హాజీపూర్, నెన్నెల 92 శాతం, బెల్లంపల్లి, దండెపల్లి, వేమన్‌పల్లి 91 శాతం, చెన్నూర్ 90 శాతం, మందమర్రి 89 శాతం, జన్నారం 86 శాతం ఆస్థి పన్ను వసూళు అయ్యాయి.

జైపూర్ మండలంలో..



జైపూర్ : ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

జైపూర్ మండలంలో గల 20 గ్రామ పంచాయతీలలో గల 11 గ్రామ పంచాయతీలు 100 శాతం ఆస్థి పన్ను వసూళ్ల నమోదు చేసుకోగా ఇందులో ఇందారం, బెజ్జాల, కిష్టాపూర్, ముదిగుంట, నర్సింగాపూర్, నర్వ, పౌనూర్, శెట్‌పల్లి, వేలాల, వెంకట్రావుపల్లి, ఎల్కంటి గ్రామాలు ఉన్నాయి. అదే విధంగా కుందారం 99 శాతం, గంగిపల్లి 97 శాతం, జైపూర్ 96 శాతం, మిట్టపల్లి, రామారావుపేట్, పెగడపల్లి గ్రామ పంచాయతీలలో 92 శాతం పన్ను వసూలైంది. టేకుమట్లలో 91 శాతం, కానుకూరు, శివ్వారం గ్రామ పంచాయతీలలో 80 శాతం నమోదు చేసుకుంది.

నగదు లావాదేవీలను చూస్తే...

జైపూర్ మండలంలో గల 20 గ్రామ పంచాయతీలలో 10 వేల 795 నివాస గృహాలకు సంబంధించి ఆస్థి పన్ను వసూళ్ల పరిశీలిస్తే రూ. 1 లక్ష 85 వేల 754 బకాయిలు పెండింగ్‌లో ఉండగా ఈ ఏడాదికి సంబంధించి రూ.49 లక్షల 55 వేల 122 వసూళ్ల చేయాల్సివుంది. మొత్తంగా చూస్తే రూ. 51 లక్షల 40 వేల 876 ఆస్థి పన్నుగా వసూలు చేయాల్సివుంది. ఇందులో నుండి పెండింగ్ బకాయిల నుండి రూ. 1లక్ష 22 వేల 922 ఈ ఏడాదికి సంబంధించి రూ.48 లక్షల 08 వేల 339 మొత్తంగా రూ. 49 లక్షల 31 వేల 261 వసూళ్ల చేసి గత పెండింగ్ బకాయిలు తగ్గించుకోవడంతో పాటు ఈ ఏడాదికి సంబంధించి దాదాపుగా పూర్తి చేసి జిల్లా స్థాయిలో 96 శాతం వసూళ్లతో మొదటి స్థానంలో నిల్చింది.

రాజీవ్ యువ వికాసానికి విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేయూత అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, దినపత్రికలు, ప్రసార సాధనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల వరకు ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అర్హులైన వారు ఏప్రిల్ 14 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని తెలిపారు. రూ.50 వేల లోపు రుణం 100 శాతం మాఫీ, రూ.1 లక్ష లోపు రుణం 90 శాతం రాయితీ, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు70 శాతం రాయితీ లభిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి శవపేటిక అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటిగూడ గ్రామంలో రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు విరాళాలు సేకరించి శవపేటిక కొనుగోలు చేసి సోమవారం గ్రామ ప్రజల సమక్షంలో గ్రామపంచాయతీకి శవపేటిక అందజేశారు. ఈ సందర్భంగా రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షుడు ఉప్పు మల్లేశం, వ్యవస్థాపకులు సేపూరి గోపాల్ మాట్లాడుతూ రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఏర్పాటయి 6 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు కమిటీ నుంచి రూ.8లక్షల పైబడి ఆర్థిక సాయం చేసామని భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. గల్ఫ్ కార్మికులకు కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజాసేవకు కమిటీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. బయట దేశంలో ఆపదలో చిక్కుకున్న కార్మికులకు కూడా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థలు ఓవర్ మెన్‌గా ఉద్యోగంలో చేరిన శ్రీనివాసు విధుల పట్ల అంకితభావంతో నిర్వర్తిస్తూ అంచలంచలుగా ఎదిగారని ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు అన్నారు. సూపరిటెండెంట్ ఇంజనీరు(సివిల్)గా సోమవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 41 సంవత్సరాల 7 నెలలు వివిధ ఏరియాలలో వివిధ హోదాల్లో శ్రీనివాసు పనిచేశారని గుర్తు చేశారు. ఆయనతో కలిసి పనిచేసిన గత అనుభవాలను గుర్తు చేశారు. ప్రధానంగా ఎస్టీపీపీలో రామాలయం నిర్మాణ సమయంలో కూడా వారు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎ ఈ కార్యక్రమంలో జేఎస్ సింగ్, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జోగు పర్శయ్య, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్. మదన్ మోహన్, తుకారాం పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు జిల్లా అంతటా మార్చి 31 నుండి ఏప్రిల్ 30 వరకు పోలీస్ ఆక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డివీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని సూచించారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరానికి పురిగోల్పే ఎటువంటి ఆయుదాలైనా వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను జనసమూహం పోగు అవుట వంటివి నిషేధం అని, రాళ్ళను జమ చేయుట దరించి సంచరించుట వంటివి నిషేధం అని, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేదమని తెలిపారు.

జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు

● ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు ● పోలీసుల పటిష్ట భద్రతా ఏర్పాట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివారం నెలవంక దర్శనమివ్వడంతో దేశ వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ముగించిన వేళ ఈదుల్ ఫితర్ జరపడం ఆనవాయితీ, రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరపనున్న నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే రంజాన్ పర్వదినం మతసామరస్యాన్ని, ఆత్మీయతను, సోదరభావాన్ని, సేవాతత్పరతకు చిహ్నంగా జరుపుకుంటారని ఇస్లాం మత గ్రంథాల్లో పేర్కొన్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఈద్ ముబారక్ అని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని బాబాపూర్ రహదారికి వెళ్లే ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ వేడుకలు మతసామరసాన్ని, ఆత్మీయతను చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బాబురావు, భీమేశ్, నిసార్, వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, నాయకులు మల్లేష్, అబ్దుల్లా, ఖలీమ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పోలీసులు పటిష్ట బందోబస్తు

రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎస్డీపీఓ చిత్తరంజన్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ రవీందర్ ఎస్ఐ ప్రశాంత్‌తో పాటు కానిస్టేబుల్లు బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరులకు పోలీసులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పెంచికల్ పేట్ : మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సిర్పూర్(టి) : రంజాన్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో రెండు ఈద్గా వద్ద ముస్లిం సోదరులు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. అనంతరం పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా బస్టాండ్ ప్రాంతాలలో కౌటాల సీఐ రమేష్ బాబు, ఎస్ఐ కమలాకర్ ఆధ్వర్యంలో మండలంలో పలు ప్రధాన కూడలిలో బస్టాండ్, ఈద్గా ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

లక్షెట్టిపేట : పట్టణంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లీంలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని క్లబ్ రోడ్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకొని శు భాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దైవ ప్రవక్త మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారు. పవిత్రమైన ఈ మాసంలో నెల రోజులు ఉపవాసాలు ఉంటూ, మతసామరస్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ముస్లింలందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. స్థానిక నాయకులు ముస్లిం సోదరులకు కలిసి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పండగ సందర్భంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో షామియానాలు, కార్పెట్లు, టెంట్‌లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహించారు.

తాండూర్ : మండల కేంద్రంలో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాండూర్ బస్ స్టాండ్ వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కిరణ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎల్క రామచందర్ మాజీ జడ్పీటీసీ సాలిగామా బానయ్య, మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్, మాజీ ఎంపీపీ సిరంగ్ శంకర్. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గా వద్ద ఒకరికొకరు ఆ లింగనం చేసుకొని భాకాంక్షలు తెలియజేసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఈసా ఇంటి వద్ద నిర్వహించిన వేడుకల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



తాండూర్ : బెల్లంపల్లిలో అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

రంజాన్ సందర్భంగా సాయి భోజన్

ప్రేమ, త్యాగానికి ప్రతీక అయిన రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్, కాల్ టెక్స్, బజార్ ఏరియాలో సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి తెలిపారు. ప్రతీ మతం సాటి మనిషికి సాయం చేయమని చెప్తోందని, అన్ని మతాల సారం ఒకటేనని ప్రపంచానికి చాటిచెప్పిన శ్రీ షిరిడి సాయిబాబా మాటలే స్ఫూర్తిగా భాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవని తెలిపారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు సేవకులు స్రవంతి, సాయి మనోజ్ఞ త్రివిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో..



పెంచికల్‌పేటలో..



లక్షెట్టిపేటలో..